# పగిలిన పలక

మేడిచర్ల గోపాలకృష్ణమూర్తి

ఒంటిగంటయింది. రాముడికి చదువు చెప్పడంకోసం చాలాసేపు నిరీక్షించి వేరే పనిలో నిమగ్నుడు కాబోతున్నాడు రవి. రాముడు వాడిన ముఖంతో యెదురుగా వచ్చి నిలబడ్డాడు.

రవి అతని ముఖాన్ని చూడకుండా "ఏం! ఇవాళ ఇంతఆలస్యంగా వచ్చావు?" అన్నాడు.

రాముడు అనలేక అనలేక "చదువుకునేందుకు రాలేదు బాబూ." అన్నాడు మంద నిస్వనంతో.

రవి కార్యాంతరంలో నిమగ్నుడు కావడం చేత అతని స్థితిని సరిగా అర్థం చేసుకోలేక విపరీత ధోరణిలో "చదువుమీద అప్పుడే మోహం మొత్తిందల్లే ఉందే?" అన్నాడు.

"మోహం మొత్తలేదు కాని, మోహం మొత్తేట్లు చేశారు బాబూ."

రవికా మాట వినబడడంతో ఒడలు కంపించింది. తాను చూస్తున్న పుస్తకాన్ని మూసేసి అతనివంక చూశాడు. అతని ముఖం పాలిఉన్నది. కళ్లు మాత్రం ఎర్రబారి ఉన్నాయి. "ఏం! రామూ అలా ఉన్నావు?" అని ఆశ్చర్యపూరిత తూర్ణనిస్వనంతో అన్నాడు.

"మాకు చదువుకునే యోగ్యత లేదని తమతో ఆరోజునే మనవి చేసుకున్నాను. నా గుడ్డితనాన్ని పోగొట్టడం కోసం తమరు చేసిన బలవంతంతో నేను కూడా ఈ ప్రపంచాన్ని కళ్లు తెరుచుకు చూద్దామని ఎంతో ఆశపడ్డాను. కాని ఆ ఆశ నిరాశ అయిపోయింది. మాకు కళ్ళు తెరుచుకు చూసే యోగ్యత లేదు. మేము గుడ్డిగా ఉంటేనే మా కడుపులు కొంచెమైనా నిండతాయి. అయినా బాబూ! మేము చదువుకుని చేసే ఘనకార్యం మాత్రం ఏముంది? మమ్మల్నిలానే పశువుల్లా బ్రతకనియ్యండి. మాకు చదువూ వద్దు చట్టూ వద్దు!" అని ఎంతో ఆవేదనగా అన్నాడు.

రవి అతని ఆవేదనాపూరిత వాక్యాలకి చకితుడయినాడు. "దీనికంతా నందబాబు క్రౌర్యమే కారణమై ఉంటుంది. ఆరోజు నాతో నందబాబు యిలాగే అనేశారు." అని ఆలోచనాపూరిత దృక్కులతో చూశాడు.

* * *

ఆరోజు పనిమీద నందబాబు గారింటికి వెళ్ళాడు రవి. అప్పుడు నందబాబింట్లో లేరు. కుర్చీలమీద బీరువాలమీద గోడలమీద సన్న దుమ్మును దులుపుతున్న రాముణ్ణి "బాబుగారెక్కడికి వెళ్ళారు?" అని అడిగాడు.

"ఇక్కడికే బాబూ! యిప్పుడే వస్తారు కూర్చోండి" అన్నాడు రాముడు.

రవికి నందబాబుతో పని వుండడం వల్ల అతని రాకకోసం యెదురు చూస్తూ పేపరు చూసుకుంటూ కూర్చున్నాడు. రాముడు దుమ్ము దులిపి నందబాబుగారి బూట్సులకు మెరుగుపెడుతూ కూర్చున్నాడు. ఐదు నిముషాలపాటు యెవరూ ఏమీ మాట్లాడలేదు. తరువాత రాముడు చిరునవ్వుతో "రవి బాబుగారూ! పత్రిక విశేషాలేమిటి?" అని అడిగాడు.

"చదువుకుంటే నీకే తెలుస్తాయిగా?"

"నేను చదువుకోగలిగితే మిమ్మల్నడిగే ఖర్మ దేనికి?" అని కొంచెం చింతాగర్భితంగా అన్నాడు.

"పోనీ సంతకం అయినా చేయగలవా?"

"వేలు ముద్దర దిట్టంగా వేయగలను."

రవి కతనిమీద కోపంవచ్చింది. 'జన్మ ఎత్తిన ప్రతివ్యక్తీ వ్యక్తిత్వంతో బ్రతకాలి.' అని అతనభిప్రాయం. "సిగ్గుండక్కరలేదుట్రా చెప్పుకోడానికి? మహా ఘనకార్యంచేసిన ధీరుడల్లే అంటున్నావు" అన్నాడు.

రాముడు అతని కోపపూరిత వాక్యాలకు ఏమీ చలించలేదు.

"దేనికి బాబూ సిగ్గు? చేతనై చేయలేక

పోతే సిగ్గు. మాకే, డబ్బూ దస్కం ఏమీ లేదు. మీబోటి అయ్యలదగ్గిర చాకిరీ చేసుకుంటేనేగాని ఆ గంజినీళ్ళయినా కడుపులోకి దిగవు. అల్లాంటి మాకు చదువుకూడా వస్తుంది బాబూ? మీరు ఏనాడో పెట్టి పుట్టారు. మీకే బాధక్కరలేదు. సుఖంగా శాంతంగా యెంత చదువైనా చదువుకోవచ్చు" అన్నాడు.

రవి కోపమంతా ఒక్కసారిగా చల్లారిపోయింది. "నాకు అతను చదువుకోలేదన్న ఆ వేదనే కలిగిందిగాని ఎలా చదువుకుంటాడు అనే వివేచనే కలుగలేదని" తనలో తాను బాధపడ్డాడు.

"పోనీ నేను చదువుచెప్తా చెప్పుకుంటావా?" అని యెంతో ఆదరణగా అన్నాడు.

"ఎక్కడ చదివేది బాబూ! పొద్దున ఆరు గంటల దగ్గిరనుండీ రాత్రి పదిగంటలవరకూ చాకిరీతోనే సరిపోతుందాయె. మధ్యలో రెండు గంటలు కాళీ ఉన్నా బడలిక తీర్చుకోడంతోనే సరిపోతుంది" అన్నాడు నిరాశగా రాముడు.

రవికి ఏమనడానికీ తోచలేదు. కొంతసేపైన తరువాత "ఒరేరామూ! నువ్వట్లాంటావు గాని మేమంతా ఎలా చదువుకున్నామో తెలుసా?"

"తెలియకేం బాబూ! శీరపాణిగారింట్లో గేదదగ్గిర పేడకూడా యెత్తి చదువుకున్నారు. కాని బాబూ! అప్పుడప్పుడు మిమ్మల్ని బైటికి వెళ్ళగొడుతూకూడా ఉండేవారనుకుంటా!"

రవి కొంచెం చిరునవ్వు నవ్వి "మరే మనుకున్నావ్! చదువుకోసం అన్ని బాధలు పడ్డాం. కనుకనే ఈ రోజున కాస్త నలుగురిలో తలెత్తుకు తిరుగుతున్నాం. నా మాట విని నువ్వు కూడా కష్టాలకోర్చి శ్రమపడి పెద్దచదువులు చదివి పెద్ద ఉద్యోగాలు చేసినా చేయక పోయినా పత్రిక చదివే శక్తినైనా సంపాదించుకుంటే చాలు. నీ దేశంలో ఏమూల ఏం జరుగుతూందో నీకు తెలియదాయెను. నాబోటిగాడు అబద్ధం చెప్పినా నిజం చెప్పినా నమ్ముతావు. అంతకన్న మరోటి చేయలేవు. అట్లాంటి నీచపుబ్రతుకు బ్రతికేం బ్రతక్కేం? ఎప్పుడూ మానవుడు విజ్ఞానిగా ఉండాలి. పశువులా పరప్రత్యయనేయ బుద్ధితో ఉండరాదు. అందుకని నీకున్న రెండుగంటల కాళీలో నా దగ్గిరకు వచ్చి చదువుకో. నీవుకూడా ఓమనిషి వవుతావు" అన్నాడు.

రవి ఎంత ఉద్రేకంతో చెప్పినా రాముని హృదయం కొంచెమైనా చలించలేదు. "కాని బాబూ! నాకూ మీకూ చాలా తేడావున్నది. నాకు విశ్రాంతి ఉన్నా చదువుకునే అవకాశం లేదు. మీకు చాకిరీ ఉన్నా చదువుకునే అవకాశం మాత్రం చాలావున్నది. ఇట్లాంటప్పుడు చదువుకుని మానవత్వాన్ని ఎలా నిలబెట్టుకోగలను. అయినా ఇప్పుడు చదువుకుంటే మాత్రం వచ్చి చస్తుందా! సుఖానున్న ప్రాణాన్ని కష్టపెట్టుకోడం తప్ప మరేంలేదు" అన్నాడు.

"పిచ్చివాడివి రామూ, చదువుకునేవాడికి ఏ కాసేపు విశ్రాంతి లేకపోయినా బాధే. కాని ఏంచేస్తాడు గతిలేక కష్టపడి విశ్రాంతి లేకపోయినా విశ్రాంతిని కల్పించుకు చదువుకుంటాడు కాని, మానేయడు. నీకు మొదటి నుండీ సోమరిపోతుతనం ఆలవాటయింది కనుక ఆలా భయపడుతున్నావు, అంతకన్న మరేమీ లేదు. ఇహ పిచ్చిగా సమాధానం చెప్పక రేపటినుంచి నాదగ్గిరికి రా" అన్నాడు రవి.

రాముడు విధిలేక ఒప్పుకున్నట్లు మౌన ముద్రిత ముఖంతో చూశాడు. కొంతసేపయిన తరువాత "బాబుగారూ!" అని నిదానంగా పిలిచాడు.

"బాబూ లేదు గీబూ లేదు. ఇంకో మాట్లాడకు."

"అదికాదు బాబూ! పలకా బలపం కొనుక్కోనేందుకు" అని అంటుండగానే "ఓరి! అదిట్రా! నీ శంక. నేను కొనిస్తానులే భయపడక" అన్నాడు రవి నవ్వుతూ.

ఇంతలో నందబాబు వచ్చాడు. రాముడు అవతలికి లేచివెళ్ళాడు. రవి నవ్వుతూ "మీ నౌకర్ని మీరుకూడా శుద్ధమూర్ఖుణ్ణిగా తయారు చేశారేం?" అని వ్యంగ్య హేళనగా అన్నాడు.

"ఏం? ఏంచేశానేం?"

"ఏమీ చేయలేదు. పొట్ట పొడిచినా అక్షరం లేదు."

"ఓస్, అదా! నే నేమిటో అనుకున్నా." అని "నిట్టూర్చి చదువుకుని మనం చేసిన ఘన కార్యం ఏముంది. చదువుకోక వాడు చేయని

ఘన కార్యం మాత్రం ఏముంది. ఏదో ఏడపనీ. ఎట్లా ఏడుస్తే యేం?" అన్నాడు పేలవంగా నందబాబు.

రవి నా మాటలు కొంచెం కలుషితుణ్ణి చేసినాయ్. "అదేమిటి నందబాబూ! అలాంటారు. రస భక్ష్యాల కోసమూ నాలుక గీసుకోడం. ఘనకార్యం చేసినా చేయకపోయినా ప్రతి వ్యక్తి చదువుకోవలిసిందే. వాళ్ళకు గతి లేదు కనుక మనదగ్గిర చాకిరీ చేసుకుని జీవిస్తున్నారు. వాళ్ళకే కనుక మనం తగినంత అవకాశాన్ని కల్పించి చదువు చెప్పిస్తే తరువాత వాళ్లు ఘనకార్యాలు చేసినా చేయకపోయినా వివేకవంతులైనా అవుతారుగా. వివేకం కలిగుండి మన స్వార్థంకోసం మనం వాళ్ళను నీచుల్నిగా తయారుచేయడం అంత యోగ్యమైన పని కాదు. నిజంగా వాళ్ళకట్లాంటి అవకాశాల్ని కల్పించి చదువు చెప్పిస్తే అంతకన్న ఘనకార్యం యింకోటేమున్నది నందబాబూ!" అన్నాడు.

నందబాబు కళ్లు ఎర్రబారినాయి. "వీళ్ళంతా చదువుకుంటే మనం అడుక్కుతినాలి" అని కోపంతో అన్నాడు. రవి ఆ మాటకు సమాధానం చెప్పబోతుంటే "నివొచ్చిన పనేమిటో చెప్పు" అన్నాడు. రవి ఏమీ అనలేకపోయినాడు. తన పనిని మాత్రం చేసుకుని వెళ్ళిపోయినాడు.

* * *

రవి కిదంతా గుర్తుకు వచ్చింది. "నందబాబుగారేమైనా అన్నారా?" అన్నాడు.

"ఇంకేవరంటారు బాబూ! వారే కోపంతో వచ్చి పలక తీసుకుని నేలకేసి బాది "నువ్వు జాగ్రతగా ఉండి పనిచేసుకుంటే చేసుకో, లేకపోతే నడు" అని పిడుగుపడ్డట్టుగా అన్నారు. నాకేమీ కారణం కనుపించలేదు అంతకోపంగా వచ్చి పలక పగుల కొట్టడానికి. కాని చాలా సేపు తరువాత ఆలోచించగా నేను చదువుకుంటే వారి దగ్గర చాకిరీ సరిగా చేయనని భయంతో ఇలా చేసుంటారనుకున్నాను. నిజం అదే బాబూ! మా బోటి వాళ్లు కూడా పైకొస్తే ఆ మేడమిద్దెల్లో మా చేతులు పడేట్టు విసిరించుకుంటూ సుఖంగా ఎలా నిద్రిస్తారు బాబూ! మేమెప్పుడూ మూలుగుతూంటే వారి ముఖంలో చిరునవ్వు వెలుగుతూ ఉంటుంది." అని ఇంకా చెప్పుకు పోతున్నాడు రాముడు. రవి "సరే గాని, మొన్నెప్పుడో నువ్వు అక్షరాల్ని దిద్దుకుంటుంటే నంద బాబుగారు చూశారన్నావు కాదూ?" అన్నాడు.

"చూశారు బాబూ, ఆ రోజున చాలా కోపంతోనే చూశారు. 'ఓహో! మీరు పండితులు కాబోలు. అయితే మిమ్మల్ని జాగ్రతగానే చూడాలి' అని కూడా అన్నారు. నేనిదంతా చెప్తే తమరు నొచ్చుకుంటారని చెప్పలేదు."

"ఈ రోజున ఇంత కోపం కలగడానికి కారణం?"

"ఏంలేదు బాబూ! నేను వాకిట్లో కూర్చుని అక్షరాల్ని దిద్దుకుంటున్నాను. లోపలనుంచి నందబాబుగారు వారి మంచం దగ్గిర ఉన్న కూజాలో మంచినీళ్ళుతీసి ఇవ్వడం కోసం నన్ను పిలిచారుట. నాకు మాత్రం వారి పిలుపుసరిగా వినిపించలేదు. అంతకన్న మరేమీలేదు. నేనెప్పుడూ వారికి అవిధేయతగా ఉండలేను" అన్నాడు.

రవి తన్నింకేమీ ప్రశ్నించలేదు. అతను చెప్పిందంతానిజం. గడియారం రెండు గంటల్ని కొట్టింది. రాముడు తొందరబాటుగా "బాబు! నేను వెడతాను. నంద బాబుగారు నిద్రలేచే వేళవుతోంది." అని అంటూ అప్రయత్నంగా కారుతున్న కన్నీళ్ళతో "మీరు నాకు మంచి పలకనిస్తే నేను మీకు తిరిగి పగిలిన పలక నిస్తున్నాను. తీసుకోండి బాబూ" అన్నాడు దీనంగా.

రవి నిట్టూర్పు విడుస్తూ "ఎందుకు నాకా పలక" అన్నాడు.

"నాకెందుకు బాబూ! ఆ పలక, అదున్న దగ్గరనుంచీ ఎప్పుడో అప్పుడు నా బ్రతుకు కూడా బ్రద్దలవుతుందనే భయమేస్తుంది. వద్దు బాబూ వద్దు!" అన్నాడు భయకంపితుడుగా.

రవి కళ్ళంబడి బొటబొటా నీళ్ళు కారాయి. ఒడలంతా పులకితమై కంపిస్తోంది. పేదవాడు ఈ విధంగానూడా చదువుకుని పైకి రారాదా! అతనికేమీ అర్థంకాలేదు.